RNI NO :Title-Code :-TELTEL02102
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...
సంపుటి - 1 సంచిక - 174 గురువారం 21 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-
Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

## అమెరికాలో హైదరాబాద్ విద్యార్థి అదృశ్యం



4లో.

# రైతులంటే చిన్నచూపెందుకు

- ప్రజా పాలనంటే ఇదేనా?
- ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఆగ్రహం
- సీఎం గారూ అంటూ ప్రశ్నల వర్షం
- పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదు
- అకాల వర్షాలతో నష్టపోయినా లెక్కలేదు
- ఎన్నికల గోల తప్పా మరేం తెల్వదా?
- ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలేనా
- పలు ప్రశ్నలను లెవనెత్తిన కేటీఆర్



హైదరాబాద్,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం గారూ రైతులంటే మీకు ఎందుకంత చిన్నచూపు అని ప్రశ్నించారు. పంటలు ఎండుతున్నా, వడగండ్లు పడుతున్నా.. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారే తప్ప రైతుల గోడు పట్టించుకోవడం లేదెందుకని నిలదీశారు.ముఖ్యమంత్రి గారూ.. రైతులంటే మీకు ఎందుకింత చిన్నచూపు..? నిన్న.. పంటలు ఎండుతున్నా పట్టించుకోలేదు. నేడు.. వడగండ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడటంలేదు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా..? అన్నదాతల ఆర్థనాదాలు వినిపించవా..? ఎన్నికల గోల తప్ప.. ఎ పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంట నష్టంపై లేదెందుకు ? పాడైపోయిన పంటలను పరిశీలించే తీరిక లేదా..? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా..? ఇంతకాలం.. పచ్చని పైర్లు ఎండుతున్నా.. సాగునీరు ఇవ్వడం చేతకాలేదు..! ఇప్పుడు.. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్న మనసు రావడం లేదా..? గుర్తు పెట్టుకోండి..!! ఎద్దేడ్సిన ఎవుసం..! రైతేడ్సిన రాజ్యం బాగుండదు ..!! అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై.. భారత రైతు సమితి పోరాడుతూనే ఉంటది..!!!' అని సీఎంను ఉద్దేశించి ప్రశ్నలు గుప్పించారు.

# తొలివిడత ఎన్నికలకు నామినేషన్లు షురూ

- తొలివిడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 19న జరిగే ఎన్నికలకు నామినేషన్లు షురూ
- 17 రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాలు
- మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు



న్యూఢిల్లీ మార్చి 20 (జర్నలిస్ట్ వార్త): ఏప్రిల్ 19న పోలింగ్ జరగనున్న లోక్‌సభ తొలి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ జారీతో బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. బీహార్ మినహా తొలి విడత లోక్‌సభ ఎన్నికలు జరిగే మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నామినేషన్ దాఖలుకు ఈ నెల 27 వరకు అవకాశం ఇచ్చారు. బీహార్‌లో మాత్రం మార్చి 28 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించారు. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 28న నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించనున్నారు. బీహార్‌లో మార్చి 30న నామినేషన్ల స్క్రూటినీ జరగనుంది. బీహార్ మినహా మిగితా 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్చి 30 నామినేషన్ల ఉపసంహరణకు తుదిగడువు.

మిగతాది 2లో...

# తెలంగాణ ఇన్‌చార్జ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీపీ రాధాకృష్ణన్..

- రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదె
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

2లో.



# 26 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు..

## రేపో మాపో కాంగ్రెస్‌లో చేరుతారు

- : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- ప్రజాకర్షక పథకాలకు ఆకర్షితులై వారు పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని వెల్లడి
- రేవంత్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉంటారని వ్యాఖ్య

2లో.



# మంత్రిపొన్నం కాల్ రికార్డ్

## సోషల్ మీడియాలో వైరల్

తన ఫోన్ కాల్ రికార్డ్ చేసి ప్రతిపక్ష ఎమ్మెల్యేకు పంపిస్తున్నారని సీఎంకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు



2లో.

# రైతుల విషయంలో ఎన్నికల పేరుతో కాలయాపన వద్దు... మేమూ సహకరిస్తాం

- కేసీఆర్ ప్రభుత్వంలా మోసం చేయవద్దని ప్రభుత్వానికి బండి సంజయ్ సూచన
- అప్పులు చేసి పంట వేస్తే... చేతికి వచ్చే సమయానికి నీట మునిగిందన్న బండి సంజయ్
- రెండు లక్షల రుణమాఫీ, పంట బీమా అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్,మార్చి 20 (జర్నలిస్ట్ వార్త): రైతుల విషయంలో ఎన్నికల పేరుతో కాలయాపన చేయవద్దని... రైతులను ఆదుకునే విషయంలో తామూ సహకరిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. బుధవారం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వంలా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేయకూడదని హితవు పలికారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల జిల్లా రైతులనూ ఆదుకోవాలన్నారు. రైతులు అప్పులు చేసి పంటలు వేశారని.. చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాల



కారణంగా నీటమునిగిందని వాపోయారు. గత పదేళ్లలో ఒక్క రైతుకు కూడా పంట నష్టపరిహారం అందలేదన్నారు. ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల పేరుతో రైతులకు కాలయాపన చేయవద్దన్నారు. కాగా, రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో సిరిసిల్ల జిల్లా సహా పలు ప్రాంతాల్లో పంట నీట మునిగింది. వడగండ్ల వానకు పంట నేలపాలైంది. అకాలవర్షాలతో పంట దెబ్బతిందని, కాబట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విమర్శలకు తెరలేపిన కాంగ్రెస్ కార్యకర్తలు

## - చోద్యం చూస్తున్న కాంగ్రెస్ నాయకులు

**వర్ధన్నపేట, మార్చి 20 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో గత మూడు రోజులుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై మరొకరు విమర్శలకు తెరలేపారు. నియోజకవర్గం స్థాయిలో విమర్శలు తలెత్తుతుంటే స్థానిక నాయకులంతా చోద్యం చూస్తున్నారు. లేనప్పుడు లేకనే పాయే, ఉన్నప్పుడు తినడం రాదాయే అన్న చందంగా కాంగ్రెస్ కార్యకర్తల తీరు తయారైంది. గడిచిన 10 సంవత్సరాల కాలంలో గత పాలకులతో అనేక ఒత్తిడులు ఎదుర్కొన్నారు. కేసుల పాలైనారు, అటు ఆర్థికంగానూ ఇటు శారీరకంగానూ కాంగ్రెస్ కార్యకర్తలు మానసిక ఇబ్బందులను చవిచూశారు. తమ పార్టీ అధికారంలోకి తప్పకుండా వస్తుందని ధీమాతో ఇంతకాలంగా కలిసికట్టుగా పనిచేశారు. చివరకు పది సంవత్సరాల తర్వాత అధికారాన్ని దక్కించుకున్నారు. మూడు మాసాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను స్వాధీనం చేసుకుని అధికారులు చేజిక్కించుకుంది. 10 సంవత్సరాల వనవాసం తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం కార్యకర్తల కళ్ళల్లో కనిపించడం లేదు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై మరొకరు విమర్శలు వర్షం కురిపిస్తున్నారు.



2014 సమయం నుంచి ఇప్పటివరకు వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులుగా సీనియర్ కార్యకర్త చిదురాల కుమారస్వామి కొనసాగుతున్నారు. ఆయన పదవికి ప్రస్తుతం చిక్కుముడి పడింది. అదే పట్టణ కేంద్రానికి చెందిన మైస సురేష్ అనే కార్యకర్త పట్టణ అధ్యక్షులుగా నియామక పత్రం తెచ్చుకున్నట్లు సమావేశాల ద్వారా తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా ఒకరిపై మరొకరు సమావేశాలు నిర్వహిస్తూ విమర్శల పర్వం కురిపిస్తున్నారు. ఒకవైపు కార్యకర్తల సమావేశంలో అధికారం రాకమునుపే పట్టణ అధ్యక్షులుగా కొనసాగుతూ కష్టకాలంలో పనిచేసిన ఆయనే మరోసారి పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నారు. మరో వైపు నియమాక పత్రం తెచ్చుకున్న సురేష్ బాధ్యతలు కొనసాగించాలని వాదన చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్యకర్తల మధ్య విభేదాల చిచ్చు రగులుతుంటే నియోజకవర్గ నాయకులు మాత్రం తమకేమీ పట్టింపు లేనట్లుగా వ్యవహరించడం పట్టణ కేంద్రంలో చర్చ జరుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే గెలుపు రాజకీయాల్లోనే ఓ నూతన అధ్యాయంగా మిగిలిపోయింది. ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించి, పదవి విరమణ పొందిన కేఆర్ నాగరాజు నూతనంగా రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పది సంవత్సరాలు ఏకధాటిగా వర్ధన్నపేట నియోజకవర్గాన్ని పరిపాలించారు. 86 వేల మెజారిటీ అందించి ఆయనను ఆశీర్వదించిన ప్రజలు ఎలాంటి పరిచయం లేకపోయినప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్యేకు మెజారిటీ అందించి గెలిపించడం ప్రస్తుత రాజకీయాల్లోనే చరిత్రగా మారింది. కాంగ్రెస్ పార్టీని గెలిపించమంటూ కార్యకర్తలంతా సైనికుల పనిచేసే ప్రజల మన్ననలు పొందారు. ఇలా కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమే నేటి ఎమ్మెల్యే పదవి బాధ్యతలని చెప్పవచ్చు. అలాంటప్పుడు కార్యకర్తల మధ్య విభేదాలు చోటు చేసుకుంటే పరిష్కరించే బాధ్యత తనపై ఉందని భావించడం ధర్మం. ఇప్పటికైనా వర్ధన్నపేట ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్ రావు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో జరుగుతున్న కార్యకర్తల విమర్శల పర్వానికి తెరవేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఎస్.కె మంజూర్, ఎండి షబ్బీర్, ఎర్ర ప్రేమ్ రాజ్, బంగారు సదానందం, సమ్మెట రాంబాబు, వికే ఎల్లగౌడ్, ఎర్ర శ్రీకాంత్, చందు మల్లయ్య, కొండేటి బాలకృష్ణ, ఎర్రగొల్ల జగన్, శివరాత్రి వెంకట నర్సయ్య, ఎల్లస్వామి, మాజీ సర్పంచ్ లచ్చిరాం నాయక్, అయిత సుధాకర్, బొంత వెంకన్న, ఎండి సోహెల్, తుమ్మల యాకయ్య, కొండేటి సుధాకర్, చెన్న రాజు, చింత మురళి, గడ్డం నారాయణ, బొంత స్వామి తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి సిపిఎం పోటీ

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త)** భువనగిరి : భువనగిరి పార్లమెంట్ స్థానానికి జహంగీర్ పోటీ చేస్తారని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య వెల్లడించారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలలో తమ పార్టీ ఒక స్థానంలో బరిలో ఉంటామని వెల్లడించారు. మిగిలిన 16 పార్లమెంట్ స్థానాలకు సంబంధించి ఏ పార్టీకి మద్దతు ఇవ్వా లని లోతుగా చర్చించి నిర్ణయిస్తామన్నారు. ఇప్పటికైతే తాము బిజెపి పార్టీని ఓడించేందుకు ఇండియా కూటమిలోని ఉన్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కులాల పేరిట ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు సరైన విధానం కాదని



తప్పుబట్టారు. ఎస్సి, ఎస్టిలకు అణగారిన వర్గాలు అన్నిటా వెనుకబడినందున వారికీ మొదటి నుండి కార్పొరేషన్‌లు ఉన్నాయని గుర్తు చేసారు.
చేతి వృత్తాల వారికీ కార్పొరేషన్ ఉండటం వల్ల వారికీ సహాయం అందుతుందని, కానీ ఎలాంటి కుల వృత్తి లేని వారికీ, కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడమంటే కులాలను సంతృప్తి పర్చడానికేనని విమర్శించారు. ధరణి విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అన్నారు . ఇందిరమ్మ ఇండ్ల కోసం పేద ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. మూసీ నదిని ముందుగా శుద్ధీకరించి, ఆ తర్వాత సుందరీకరణ పనులు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాజీ ఎంఎల్ఎ జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, టి జ్యోతి, భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఎండి జహంగీర్ పాల్గొన్నారు.

# గట్టికల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సంతోష్ ఎన్నిక



రాయపర్తి,: పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని గట్టికల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మెరుగు సంతోష్ ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి,మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరి వెంకన్న, వెంకటరాజం, రామ్మూర్తి, వెంకన్న ,లక్ష్మణ్ ,బిక్షపతి, సత్యనారాయణ ,రాము, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి 12 సీట్లలో విజయం: ఈటెల

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి 12 సీట్లలో విజయం సాధిస్తుందని, ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన పథకాలు మరోసారి గెలిపిస్తాయని మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గం బిజెపి మేనిఫెస్టోను మోడీ గ్యారంటీ, ఈటల ష్యూరిటీ పేరుతో విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార వివరాలు, బిజెపి పథకాలతో పొందుపరిచిన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. శామీర్ పేట తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వేలాదిగా తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులకు, అభిమానులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మే 13న దేశవ్యాప్తంగా ఎన్నికల్లో భాగంగా ఎన్నికల శంఖారావం మల్కాజిగిరిలో స్వయంగా ప్రధాని మోడీ ప్రారంభించారని,యావత్ తెలంగాణ మోడీ ఆలోచనతో 370 సీట్లకు పైగా బీజేపీ సొంతంగా గెలవాలనే నినాదాన్ని నిజం చేయాలని సమర శంఖం పురించారని పేర్కొన్నారు. ఆంక్షలు, ఇబ్బందులు ఉన్నప్పటికి కూడా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు లక్షలాదిగా పాల్గొన్న తీరును చూపించిన ప్రేమకు తెలంగాణ ప్రజలకు కృతజ్ఞుడిగా ఉంటానని మరుసటి రోజు జరిగిన నాగర్ కర్నూల్ సభలో, జగిత్యాల సభలో మోడీ చెప్పినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడిగా నా చరిత్ర మీ కళ్ళ ముందు కదలాడుతుందని, ఏ అకుంఠిత దీక్ష కోసమైతే పోరాడేమో అదంతా మీ కళ్ళ ముందు ఉన్నదన్నారు. తెలంగాణ తొలి ఆర్థిక మంత్రిగా, కరోనా సమయంలో ఆరోగ్య మంత్రిగా పనిచేసి ప్రజలకు సేవలందించినట్లు చెప్పారు.
కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్మెంట్ సంస్థలతో మేక్ ఇన్ ఇండియా, మేడిన్ ఇండియా నినాదంతో ఈ నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు



కల్పిస్తానన్నారు. గ్రేటర్ నగరంలో పేదవారికి స్థలం కొనుగోలు చేసే భాగ్యం లేకుండా పోయిందని, సొంత ఇంటి కలగానే మిగిలిందన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 2 లక్షల 37 వేల ఇల్లు మంజూరు చేసిన వాటిని నిర్మించి పేదలకు పంచడంలో గత ప్రభుత్వం విఫలమైందన్నారు. పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం రాజధానికి వచ్చిన పేదలతో సహా ఇక్కడ ఉండేవారికి సొంత ఇంటి కల నెరవేర్చడంలో తాను కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు.
వైద్యం మీద పెట్టే ఖర్చు అనుకోకుండా వచ్చి పడే పిడుగు లాంటిదని, పేదవారికి వైద్య అవసరాల కోసం డబ్బులు లేక అప్పులు చేసి వైద్యం చేయించుకోవడం మనుషులకు దూరమైతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ , ఎయిమ్స్‌తో పాటువైద్య సౌకర్యాల కల్పనలో మరింత చేరువ చేసే ఏర్పాటు చేస్తానన్నారు. స్థానికంగా డ్రైనేజ్ , రోడ్లు, రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. కేంద్రంలో మోడీ సర్కారు ఉంది దరఖాస్తు చేస్తే సమస్యలు పరిష్కారిస్తానని తెలిపారు.



# పాలిసెట్ పరీక్ష తేదీలో మార్పు

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టిఎస్ పాటిసెట్)ను వాయిదా వేస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం మే 17న జరగాల్సిన పాలిసెట్ పరీక్షను మే 24న నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ మండలి కార్యదర్శి ఎ.పుల్లయ్య తెలిపారు. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో పాలిసెట్ పరీక్షను వాయిదా వేశారు. గత నెలలో పాలిసెట్ నోటిఫికేషన్ వెలువడగా, ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు ఏప్రిల్ 22 వరకు అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటిక్నిక్ కళాశాలల్లోని డిప్లొమా సీట్లను పాలిసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు

# బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** నాంపల్లి కోర్టు బుధవారం సంచలన తీర్పు వెలువరిచింది. ఏడేళ్ల బాలికపై అఘాయిత్యానికి యత్నించిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల రూపాయల జరిమానా విధిస్తూ 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అనిత తీర్పునివ్వటం జరిగింది. బాధితురాలికి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే 2021, నవంబర్ 21న సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న ఏడేళ్ల బాలిక తన ఇంటి యాజమాని ఇంట్లో టివి చూస్తుండగా పొరుగునే ఉంటున్న గాలి తరుణ్ (20) చిన్నారి వద్దకు వెళ్లాడు. తన వెంట వస్తే మ్యాజిక్ చూపిస్తానని బాలికను పిలిచాడు.వెంట రావటానికి ఆమె నిరాకరించినా బలవంతంగా అక్కడి నుంచి తీసుకెళ్లి అఘాయిత్యానికి చేసేందుకు యత్నించాడు. అదే సమయంలో ఇంటి యజమాని కుమారుడు రాకేశ్ అటుగా వచ్చి బాలికను రక్షించాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయగా సైఫాబాద్ ఎసిపి వేణుగోపాల్‌రెడ్డి కేసులు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టుకు ఛార్జిషీట్ సమర్పించారు. కేసును విచారించిన జడ్జి అనిత నిందితునికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. పకడ్బందీగా దర్యాప్తు జరిపి నిందితునికి శిక్ష పడేలా చూసిన ఎసిపి వేణుగోపాల్‌రెడ్డితో పాటు ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.


# అమెరికాలో హైదరాబాద్ విద్యార్థి అదృశ్యం

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** అమెరికాలో చ దువుతున్న హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ మహమ్మద్ అనే విద్యార్థి ఈ నెల 7వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. అతడు క్లీవ్‌ల్యాండ్ విశ్వవిద్యాలయంలో ఐటీ మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నాడు. తమకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్ వచ్చిందని అబ్దుల్ తండ్రి మహమ్మద్ సలీం వెల్లడించారు. వారు 1,200 డాలర్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, లేనిపక్షంలో తమ కుమారుడి కిడ్నీ విక్రయిస్తామని బెదిరించినట్లు తెలిపా రు. తాము దానికి అంగీకరించి అబ్దుల్ వాళ్ల అధీనంలోనే ఉన్నట్లు ఆధారాలు చూపమని అడిగామ ని పేర్కొన్నారు. దీనికి కిడ్నాపర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి ఫోన్ పెట్టేశారని, మళ్లీ కాల్ చేయలేదని వెల్లడించారు. కానీ కిడ్నాపర్ మాట్లాడటానికి ముందు ఫోన్‌లో ఏడుపు వినిపించిందన్నారు. ఈ నెంబర్‌ను అమెరికాలోని తమ బంధువులకు



పంపించామని,దానిని క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు అందజేయాలని చెప్పినట్లు తెలిపారు.క్లీవ్‌ల్యాండ్‌లో డ్రగ్స్ అమ్మే ముఠానే ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. అబ్దుల్ మహమ్మద్ అదృశ్యమైన విషయంపై అతడి బంధువులు ఈ నెల 8న క్లేవ్‌ల్యాండ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఒక లుకౌట్ నోటీసు జారీ చేశారు. మరోవైపు అతడి కుటుంబసభ్యులు మార్చి 18వ తేదీన చికాగోలోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించి, తమ కుమారుడి ఆచూకీ కనుగొనడంలో సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇక విద్యార్థి తల్లి మాట్లాడుతూ తన కుమారుడితో చివరిసారిగా ఈ నెల 7వ తేదీన మాట్లాడినట్లు తెలిపారు. తన కొడుకు ఎక్కడున్నాడో పోలీసులు దర్యాప్తు చేయాలని, ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది అమెరికాలోని చికాగోలో హైదరాబాద్‌కు చెందిన మరో విద్యార్థి సయ్యద్ మజాహిర్ అలీపై కూడా గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ విద్యార్థి ఇండియానా వెస్లయన్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అక్కడి భారత దౌత్య కార్యాలయం ఆ విద్యార్థికి అవసరమైన సాయం చేసింది.


# దేశ ప్రజలకు నేనిచ్చే సందేశం ఇదే : చీఫ్ జస్టిస్ చంద్రచూడ్



**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** కుల, మత, ప్రాంత, సంపద, సామాజిక స్థాయి, స్త్రీపురుష భేదాలకు అతీతంగా సుప్రీం కోర్టు దేశప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ అన్నారు. జాతీయ మీడియాకు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. "సాధారణ ప్రజలకు సుప్రీం కోర్టు ఎప్పుడూ అండగా ఉంటుంది. దేశప్రజలకు నేనిచ్చే సందేశం ఇదే' అని ఆయన అన్నారు. "మా దృష్టిలో ఏ కేసూ చిన్నది కాదు. అందరూ మా దృష్టిలో సమానమే. సాధారణ ప్రజలకు అండగా ఉండాలన్నదే మా మిషన్. అధికారంలో ఎవరున్నా ప్రజలకు కొన్ని సమస్యలు ఉంటాయి. ఆ విషయం మాకు తెలుసు. కాబట్టి, చట్టాన్ని పరిరక్షించడంలో న్యాయవ్యవస్థది కీలక పాత్ర" అని ఆయన అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించడంలో న్యాయవ్యవస్థది ముఖ్యమైన పాత్ర అని అన్నారు. సామాన్యులకు ఏదైనా ఇబ్బంది వస్తే తొలుత జిల్లా కోర్టులను ఆశ్రయిస్తారు. అందుకే ఇటీవల తాను జిల్లా జడ్జీలతో సమావేశం నిర్వహించానని అన్నారు. దిగువ స్థాయి కోర్టులను బలోపేతం చేస్తే న్యాయవ్యవస్థతో ప్రజల సంబంధాలు మెరుగవుతాయన్నారు. న్యాయవ్యవస్థలో విధానపరమైన మార్పుల కోసం జిల్లా జడ్జీల సలహాలు, సూచనలు స్వీకరించానని తెలిపారు. త్వరలో ఏకంగా వెయ్యి మంది జడ్జీలతో సమావేశం నిర్వహించబోతున్నట్టు చెప్పారు.


# వైద్య ఆరోగ్య శాఖలో 5348 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్..

## త్వరలోనే నోటిఫికేషన్ !



**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో 5,348 పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్చి 16న ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన సీవీని విడుదల చేశారు. పబ్లిక్ హెల్త్, ఆయుష్, డీసీఏ, ఐపీఎం, డీఎంఈ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో ఖాళీల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల రిక్రూట్‌మెంట్ బోర్డు నేరుగా ఈ పోస్టులను భర్తీ చేస్తుంది.
రాష్ట్రంలో ఉన్న 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 2021 అక్టోబర్ నుంచి ఖాళీగా ఉన్న 4356 పోస్టులను కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ పోస్టుల భర్తీకి ఇంకా అధికారిక నోటిఫికేషన్ రావాల్సి ఉంది. స్థానికత ఆధారంగా ఖాళీలు, రోస్టర్ మరియు అర్హత వివరాలతో నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

# డిఎంఇ వాణి నియామకాన్ని రద్దు చేసిన హైకోర్టు



**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** తెలంగాణ వైద్య విద్య ఇన్‌చార్జి డైరెక్టర్ గా డాక్టర్ ఎన్.వాణిని ఇటీవల ప్రభుత్వం నియమించింది. ఆమె నియామకాన్ని రాష్ట్ర హైకోర్టు సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఈగా వాణిని నియమించడాన్ని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ నరేందర్ కుమార్ హైకోర్టులో సవాల్ చేశారు. జూనియర్‌ను ఇన్‌చార్జిగా నియమించారని ఆయన పిటిషన్‌లో వెల్లడించారు. పిటిషనర్ తరపు న్యాయవాది కృష్ణయ్య వాదనలు పరిగణనలోనికి తీసుకున్న ధర్మాసనం ఇన్‌చార్జి ప్రాతిపదికన కాకుండా అదనపు బాధ్యతలు లేదా శాశ్వత ప్రాతిపదికన డీఎంఈ పోస్టు భర్తీ చేయాలని ఆదేశించింది.

# నాలుగో రోజు ముగిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విచారణ

**ఆదివారం నుంచి విచారిస్తున్న ఈడీ అధికారులు**
**ఈరోజు పీఏలు రాజేశ్, రోహిత్ రావులను కూడా ప్రశ్నించిన ఈడీ**
**కవితను కలిసేందుకు కార్యాలయానికి వచ్చిన కవిత న్యాయవాది మోహిత్ రావు**



**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) ఢిల్లీ :** ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు నేడు నాలుగో రోజు విచారించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్ట్ చేసిన అధికారులు శనివారం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఆమెను వారం రోజుల ఈడీ కస్టడీకి కోర్టు అప్పగించింది. ఆదివారం నుంచి ఆమెను విచారిస్తున్నారు.కవితతో పాటు పీఏలు రాజేశ్, రోహిత్ రావులను కూడా ఈడీ అధికారులు విచారించారు. కవితను అరెస్ట్ చేసిన అనంతరం వారికి కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. దీంతో వారు ఈ రోజు ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో అధికారుల ఎదుట హాజరయ్యారు. ఇదిలా ఉండగా, కవితను కలవడానికి ఈడీ కార్యాలయానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, న్యాయవాది మోహిత్ రావు వచ్చారు.

# ఉప్పల్ మ్యాచ్‌లకు గట్టి భద్రత: రాచకొండ సీపీ




**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) హైదరాబాద్ :** ఐపీఎల్ 2024 క్రికెట్ మ్యాచ్ లకోసం ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం సిద్ధమవుతోంది. ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్ ల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు రాచకొండ కమిషనరేట్ పోలీసులు.



మ్యాచ్ ల సందర్భంగా భద్రతా ఏర్పట్లపై మంగళవారం(మార్చి 19) రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు సీనియర్ అధికారులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఐపీఎల్ మ్యాచ్ లు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సీపీ తరుణ్ జోషి అధికారులను ఆదేశించారు. కఠినమైన భద్రతా ప్రోటోకాల్ ను కొనసాగిస్తూ ప్రేక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు.. కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తున్నారు రాచకొండ కమిషనరేట్ పోలీసులు. ప్రధానంగా ఉప్పల్ రహదారిపై ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. స్టేడియం పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని సూచించారు.టికెట్ల పంపిణీ విషయంలో గందరగోళం తలెత్తకుండా చూడాలని ఐపీఎల్ మేనేజ్ మెంట్ బృందాన్ని కోరారు. హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఐపీఎల్ మ్యాచ్ లకు వచ్చే క్రికెట్ అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాటు చేశారు.టికెట్ల పంపిణీలో పారదర్శక ఉండాలని సీపీ తరుణ్ జోషి సూచించారు. నకిలీ టికెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# ప్లీజ్.. నన్ను అలా పిలవకండి.. ఇబ్బందిగా ఉంది: విరాట్ కోహ్లీ



మరో రెండు రోజుల్లో ఐపీఎల్-2024 టోర్నీకి తెరలేవనుంది. అయితే, ఐపీఎల్ 17వ సీజన్ ప్రారంభానికి ముందు బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ (ఆర్‌సీబీ) మంగళవారం రాత్రి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ అన్‌బాక్స్ పేరిట ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఆర్‌సీబీ అభిమానులు వచ్చారు. ఇక విరాట్ కోహ్లీ బెంగళూరు జట్టుకు ఐపీఎల్ టోర్నీ మొదటి సీజన్ (2008) నుంచి ఆడుతున్నాడు. దీంతో ఆర్‌సీబీ ఫ్యాన్స్ ఆయనను 'కింగ్ కోహ్లీ' అని ముద్దుగా పిలుస్తుంటారు. అయితే, ఈ కార్యక్రమంలో విరాట్ కోహ్లీ ఇదే విషయమై హోస్ట్ దానీష్ సేత్‌తో పాటు అభిమానులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చాడు. "ప్లీజ్.. మీరు నన్ను కింగ్ కోహ్లీ అని పిలవొద్దు. నాకు ఇబ్బందిగా ఉంది. ముందు మీరు అలా పిలవడం ఆపండి. విరాట్ అని పిలవండి చాలు. ఇదే విషయం డుప్లెసిస్‌తో కూడా చర్చించాను. మీరు ప్రతిసారి నన్ను కింగ్ కోహ్లీ అని పిలుస్తుంటే చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అందుకే ఇప్పటి నుంచి ఆ పదాన్ని ఉపయోగించకండి. కేవలం విరాట్ అని పిలిస్తే చాలు" అని కోహ్లీ తెలిపాడు. ఇక ఈ కార్యక్రమంలో ఇటీవల డబ్ల్యూపీఎల్ ట్రోఫీ గెలిచిన ఆర్‌సీబీ మహిళా జట్టును బెంగళూరు యాజమాన్యం ఘనంగా సత్కరించింది. డబ్ల్యూపీఎల్ రెండో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి బెంగళూరు టైటిల్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆర్‌సీబీ అభిమానులు 16 ఏళ్ల నిరీక్షణకు తెరదించి తమ కోరికను నెరవేర్చారని సంబర పడిపోతున్నారు. ఈ విషయమై కూడా కోహ్లీ మాట్లాడాడు. "ఆర్‌సీబీ మహిళలు డబ్ల్యూపీఎల్ టైటిల్ గెలవడం నిజంగా అద్భుతం. మేము కూడా ఈసారి ఐపీఎల్‌లో విజయం సాధించి ట్రోఫీలను డబుల్ చేస్తే, అది కచ్చితంగా ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది" అని చెప్పుకొచ్చాడు.

# సెపక్ తక్ర పోటీల్లో విజేతగా పంజాబ్ యూనివర్సిటీ

**మార్చి 20 (జర్నలిస్ట్ వార్త) ఆదోని :** : ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్ తక్ర పోటీల్లో విజేతగా పంజాబ్ యూనివర్సిటీ పాటియాలా నిలిచింది.అంతకుముందు నాలుగవ రోజులుగా జరుగుతున్న పోటీలను ముఖ్య అతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అంకన్న విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. క్వాడ్రెంట్ ఈవెంట్‌లో రెండవ స్థానం యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, మూడవ స్థానం అన్నా యూనివర్సిటీ చెన్నై, మణిపూర్ విశ్వ విద్యాలయాలు నిలిచాయి. కర్నూలు ఎస్టీ జోసెఫ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ శౌరిల్ రెడ్డి, డాక్టర్ జ్యోతిర్మయి కళాశాల కరస్పాండెంట్ మురలిబాబు అథితులుగా విచ్చేసి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విట్టా సతీష్, వైస్ చైర్మన్ డాక్టర్ విజయ లక్ష్మి, కరస్పాండెంట్ దైవదినం రెడ్డి, ప్రిన్సిపాల్ మురళి మోహన్, మాజీ కరస్పాండెంట్ విశ్వనాథ రెడ్డి, మేనేజ్మెంట్ సభ్యులు, సనత్ కుమార్, సత్య నారాయణ రెడ్డి, సుగురప్ప, బసవన్న గౌడ్, వైస్ ప్రిన్సిపాల్




సురేష్, ఏర్రి స్వామి, కంబి రెడ్డి, రాయలసీమ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్లు శివ కిషోర్, మత్తాయ్యా, కళ్యాణ్ కుమార్, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

# ఇళయరాజా బయోపిక్..



ఇళయరాజా.. ఈ పేరు తెలియని వారు బహుశా ఉండరేమో. ఆయన పాట వింటే చాలు.. మ్యూజిక్ తో ప్రేమలో పడిపోతాం. దాదాపుగా ప్రతీ సంగీతాభిమాని ఇళయరాజాకు ఫ్యానే. 1970లో సంగీత ప్రయాణాన్ని మొదలు పెట్టిన మ్యాస్ట్రో ఇళయరాజా.. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఎన్నో వందల చిత్రాలకు మ్యూజిక్ అందించారు. తన సంగీతంతో యావత్ ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేశారు. ఇప్పటి వరకు 1400 వందలకు పైగా సినిమాలకు మ్యూజిక్ అందించి రికార్డు క్రియేట్ చేశారు ఇళయారాజా. ఏడు వేలకు పైగా పాటలకు బాణీలు కట్టారు. తన ప్రతిభకు గాను అనేక అవార్డులతో పాటు రివార్డులు కూడా పొందారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మ భూషణ్, పద్మ విభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 80 ఏళ్ల వయసులో కూడా తన మ్యూజిక్ తో అలరిస్తున్నారు. అయితే ఎప్పటి నుంచో ఇళయరాజా బయోపిక్ తెరకెక్కనుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చింది. ఇళయారాజా టైటిల్ తోనే మ్యూజిక్ మ్యాస్ట్రో బయోపిక్ ను అనౌన్స్ చేశారు. ది కింగ్ ఆఫ్ మ్యూజిక్ అని మూవీకి ట్యాగ్ లైన్ ఇచ్చారు మేకర్స్. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ఇళయరాజా రోల్ లో యాక్ట్ చేస్తున్నారు. తమిళ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ చేయనున్నారు. బుధవారం జరిగిన పూజా కార్యక్రమానికి కమల్ హాసన్ ముఖ్య అతిథిగా విచ్చేసి టైటిల్ పోస్టర్ ను లాంఛ్ చేశారు. ఈ పోస్టర్ లో చెన్నై రోడ్ల మీద ఇళయరాజా హార్మోనియం పెట్టె పట్టుకుని ఛాన్స్ ల కోసం ఎదురుచూస్తున్నట్టు ఉంది. ఈ మూవీని పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరీ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాలో చాలా మంది తమిళ, తెలుగు స్టార్ నటీనటులు అతిథి పాత్రల్లో కనిపిస్తారని సమాచారం. 2025లో ఈ మూవీ విడుదలయ్యే అవకాశం ఉంది. మరి ఈ ప్రాజెక్టుకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరో తెలుసా? ఇళయరాజానే! తన బయోపిక్ కు తానే మ్యూజిక్ అందించబోతున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ సినిమాకు ఇంతకంటే పర్ఫెక్ట్ ఛాయిస్ మరొకటి ఉండదేమోనని సినీ పండితులు చెబుతున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

# విజువల్స్ తోనే 'ఔరా' అనిపిస్తూ దూసుకుపోతున్న 'కంగువా' టీజర్!



సూర్య కథానాయకుడిగా 'కంగువా' సినిమా రూపొందుతోంది. స్టూడియో గ్రీన్ - యూవీ క్రియేషన్స్ వారు వందల కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నుంచి, నిన్న టీజర్ ను రిలీజ్ చేశారు. ఈ టీజర్ చూసిన తరువాత ఈ సినిమాపై అంచనాలు పెరగకుండా ఉండటం అసాధ్యమేనని చెప్పాలి. టీజర్ తో ఈ సినిమాను గురించి అంతా మాట్లాడుకునేలా చేయాలనే టీమ్ ప్రయత్నం ఫలించిందనే చెప్పాలి. నాయకుడి వైపు నుంచి .. ప్రతి నాయకుడి వైపు నుంచి ఈ టీజర్ ను కట్ చేశారు. గుర్రాలపై .. పడవలపై పోరాట సన్నివేశాలు టీజర్ కి హైలైట్ గా నిలిచాయి. పంచభూతాలు అనే కాన్సెప్ట్ తీసుకున్నారేమో, అందుకు తగినట్టుగా నింగి .. నేల .. నీరు .. నిప్పు .. గాలి సంబంధితమైన విజువల్స్ తో ఈ టీజర్ ను వదిలారు. కాస్ట్యూమ్స్ ను .. ఆయుధాలను డిజైన్ చేసిన తీరు, లొకేషన్స్ ప్రత్యేకమైన ఆకర్షణగా కనిపిస్తున్నాయి.విజువల్స్ పరంగా సినిమాపై అంచనాలు పెంచేలా టీజర్ తోనే మంచి మార్కులు కొట్టేశారు. అందువల్లనే ఈ టీజర్ ఒక రేంజ్ లో దూసుకుపోతోంది. గ్రాఫిక్స్ పరంగా మంచి క్వాలిటీ కనిపిస్తోంది. కెమెరా పనితనం ఏ స్థాయిలో ఉందనేది అర్థమవుతోంది. సూర్య కెరియర్లో అత్యధిక బడ్జెట్ తో రూపొందుతున్న సినిమా .. అత్యధిక భాషల్లో విడుదల కానున్న సినిమా ఇదే కావడం విశేషం. కథానాయికగా దిశా పటాని సందడి చేయనుండగా, ఇతర ముఖ్యమైన పాత్రలలో బాబీ డియోల్ .. జగపతిబాబు .. యోగిబాబు కనిపించనున్నారు.



ఆయేషా ఖాన్..

**ఓం భీమ్ బుష్ బ్యూటీ.. ఆమెకు అదే స్పెషల్ అట్రాక్షన్!**

ఆయేషా ఖాన్.. ఇప్పుడు టాలీవుడ్ లో ఈ పేరు బాగానే వినిపిస్తోంది. ఇప్పటి వరకు ఆమె నటించిన తెలుగు సినిమా ఒక్కటే రిలీజ్ అయింది. అది కూడా ఇప్పుడు కాదు.. రెండేళ్ల క్రితం. ముఖచిత్రం మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది ఈ భామ. ఈ చిత్రంలో తన నటనతో ఆకట్టుకుంది. సినిమా షూటింగ్ లో భాగంగా అప్పట్లో ప్రమాదానికి కూడా గురైంది. చాలా రోజుల తర్వాత ఆ విషయం బయటకొచ్చింది. అయితే ముఖచిత్రం సినిమాలో టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గెస్ట్ రోల్ లో నటించారు. మళ్లీ ఇప్పుడు ఆయన సినిమాతోనే ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇచ్చింది. విశ్వక్ నటిస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి మూవీలో ఆయేషా ఖాన్ ఐటెం సాంగ్ చేసింది. ఇటీవల హిందీ బిగ్ బాస్ సీజన్-17లో పాల్గొని కొద్దిరోజులకే హౌస్ నుంచి బయటకొచ్చేసింది. ఆ తర్వాత ఈ అమ్మడిని విశ్వక్ మూవీ మేకర్స్ తెలుగు ఇండస్ట్రీకి తీసుకొచ్చారు. ఇక విశ్వక్ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసిందో లేదో.. ఆమెకు వరుస అవకాశాలు వచ్చేశాయి. త్వరలోనే ఆమె ఓం భీమ్ బుష్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తన అందంతో తెలుగు ప్రేక్షకులపై మంత్రం వేసేలా ఉంది ఈ బ్యూటీ. శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఈ సినిమా మార్చి 22వ తేదీన విడుదల కానుంది. ఈ మూవీతో పాటు దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ లో కీలక పాత్ర పోషించనుంది ఆయేష. మరోవైపు, సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది ఆయేషా ఖాన్. చీరల్లో కూడా అందాలు ఆరబోయవచ్చని ప్రూవ్ చేస్తోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ లో కూడా సందడి చేస్తోంది. రీల్స్ లో సూపర్ గా డ్యాన్సులు వేస్తూ ఆకట్టుకుంటోంది. నడుము అందాలు చూపిస్తూ మాయ చేస్తుంటోంది. ఓ రేంజ్ లో ఫాలోవర్స్ ను సంపాదించుకుంటోంది. డైలీ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటోంది. తాజాగా మెరూన్ కలర్ శారీలో ఆయేషా ఖాన్ కిర్రాక్ పోజిచ్చింది. చేతులు పైకెత్తి మరీ వయ్యారాలు ఒలకబోసింది. చీర కొంగు చాటులో నడుము చూపిస్తూ అల్లాడిస్తోంది. సిల్వర్ కలర్ ఇయర్ రింగ్స్.. ముఖ్యంగా ముక్కుపుడక ఆమెకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆయేషా ఖాన్ గ్లామర్ కు అంతా ఫ్లాట్ అయిపోతున్నారు. మరి ఈ టాలీవుడ్ లక్కీ గర్ల్ ఫేట్ వరుస సినిమాలతో ఎలా మారుతుందో చూడాలి

# 'పుష్ప-2'లో రష్మిక లుక్ లీక్.. సోషల్ మీడియాలో ఫొటో వైరల్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కిస్తోన్న 'పుష్ప-2' షూటింగ్ ఫొటోలు బయటకు రావడంతో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా షూటింగ్ సెట్లో ఉన్న హీరోయిన్ రష్మిక మందన్న లుక్ లీకైంది. శ్రీవల్లి పాత్రలో నటిస్తోన్న నేషనల్ క్రష్ రష్మిక ఎరుపు రంగు చీరలో బంగారు ఆభరణాలు ధరించి ఎంతో అందంగా కనిపిస్తోంది. ఈ ఫొటోను అభిమానులు ఇప్పుడు నెట్టింట వైరల్ చేస్తున్నారు. ఇదిలాఉంటే.. ఇటీవల నంద్యాల జిల్లాలోని యాగంటి ఆలయంలో ఈ మూవీ షూటింగ్ విశేషాలను తన ఇన్స్టా స్టోరీలో రష్మిక అభిమానులతో పంచుకుంది. షూటింగ్ స్పాట్లో తీసిన ఫొటోను కూడా షేర్ చేసింది. "ఇవాళ ఈ దేవాలయంలో మూవీ చిత్రీకరణ జరిగింది. యాగంటి అని పిలవబడే ఈ ఆలయ స్థల పురాణం నిజంగా చాలా అద్భుతం. ఇక్కడి ప్రజలు, వారి ప్రేమ మాటల్లో చెప్పలేం. ఈ రోజు చాలా అద్భుతంగా గడిచింది" అని చెప్పుకొచ్చింది.

# ఘనంగా రామ్ చరణ్ కొత్త సినిమా ప్రారంభం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరో కొత్త ప్రాజక్టుకు శ్రీకారం చుట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకోబోయే ఈ చిత్రం హైదరాబాదులో నేడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. రామ్ చరణ్ కెరీర్ లో ఇది 16వ చిత్రం. ఇందులో బాలీవుడ్ ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. నేడు ముహూర్తం షాట్ కు మెగాస్టార్ చిరంజీవి, దక్షిణాది స్టార్ డైరెక్టర్ శంకర్, సంగీత స్వర మాంత్రికుడు ఏఆర్ రెహమాన్, దర్శకుడు సుకుమార్, సీనియర్ నిర్మాతలు అల్లు అరవింద్, బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ తదితరులు హాజరయ్యారు. ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. రామ్ చరణ్ ప్రస్తుతం గేమ్ చేంజర్ లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయిన వెంటనే రామ్ చరణ్ 16వ చిత్రం పట్టాలెక్కనుంది. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఇతర తారాగణం వివరాలు ప్రకటించనున్నారు. ఇందులో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ ఓ కీలకపాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది



# మోహన్ బాబు పుట్టిన రోజు సందర్భంగా 'కన్నప్ప' బుక్ విడుదల చేసిన విష్ణు...

## ఉచితంగా ఎలా పొందాలంటే...!

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్ ఇటీవలే పూర్తయింది. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రారంభించనున్నారు. కాగా, తన తండ్రి మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా మార్చి 19న 'కన్నప్ప స్టోరీ బుక్ వాల్యూమ్ 1'ను మంచు విష్ణు ఆవిష్కరించారు. ఇది భక్త కన్నప్ప గాథను కామిక్ రూపంలో చూపిస్తుంది. ఈ వినూత్న ప్రాజెక్ట్ కన్నప్ప కథను తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ కామిక్ పుస్తకంతో విష్ణు మంచు భక్త కన్నప్ప చరిత్రను ఈ తరానికి అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాంస్కృతిక వారసత్వంతో వినోదాన్ని మిళితం చేయడం ద్వారా, కన్నప్పపై ఆసక్తిని రేకెత్తించడానికి, కన్నప్ప పట్ల భక్తిని ప్రేరేపించాలన్నది ఆయన ఆలోచన. ఇన్ స్టాగ్రాంలో వారి చిరునామాను మెసేజ్ చేసిన వారికి ఈ పుస్తకాలు ఉచితంగా అందుతాయి. ఈ కథ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నేను కోరుకున్నాను. ఈ కామిక్ పుస్తకం సినిమా లాగా ఉంటుంది. నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలనేది నా కల. యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలని అనుకున్నాను. మన చరిత్ర, మన మూలాలను తెలుసుకునేలా చేయడంలో ఇది గొప్ప ప్రారంభం అని నేను భావించాను. ఇది నేను డబ్బు కోసం చేస్తున్న పని



కాదు. ఈ కథ నా మనసుకెంతో దగ్గరైంది. కన్నప్ప భక్తి భావాన్ని ప్రపంచమంతా తెలుసుకోవాలని అనుకుంటున్నాను... అని వివరించారు.ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న కన్నప్ప సినిమాకు ప్రముఖ హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ, యాక్షన్ డైరెక్టర్ కేచా ఖంఫక్డీ , డ్యాన్స్ మాస్ట్రో ప్రభుదేవా వంటి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. మోహన్ బాబు జన్మదిన వేడుకలు, మోహన్ బాబు యూనివర్సిటీ 32వ వార్షిక దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు మోహన్‌లాల్ గౌరవ ముఖ్య అతిథిగా విచ్చేయగా, టాలీవుడ్ విలన్ పాత్రల నటుడు ముఖేష్ రిషి గౌరవ అతిథిగా హాజరయ్యారు.